ఆంధ్రజ్యోతి



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.2၊ కనిష్ఠం 14.6

కామారెడ్డి
జిల్లా వార్తలు

మంగళవారం 9 జనవరి 2024

ప్రజావాణికి 46 ఫిర్యాదులు

కామారెడ్డిటౌన్, జనవరి8: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందించారు. వినతులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా అధికారులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూజిల్లా పంచాయతీ, పోలీస్‌శాఖకు సంబంధించి 36 ఫిర్యాదులు, గిరిజన, ఉపాధి శాఖలకు సంబంధించి రెండు, భూమికొలతలు, అబ్కారీ, ఐసీడీఎస్ సంబంధించి ఒక్కో వినతి అందినట్లు తెలిపారు. సమావేశంలో ఏవో మసూద్‌అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.





పార్లమెంటుపైనే నేతల నజర్!

» పోరుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు » పోటీకి ప్రయత్నాలు చేస్తున్న పలువురు ఆశావహులు
» ఎలాగైనా జహీరాబాద్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పట్టు » హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్‌కసరత్తు
» నేడు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ స్థాయి విస్తృత సమావేశం » తమకు కలిసి వస్తుందని భావిస్తున్న బీజేపీ

కామారెడ్డి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్‌స్థానంపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు జహీరాబాద్ పార్లమెంట్‌పై ఫోకస్ పెట్టాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో గట్టిపోటీ నెల కొననుంది. దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంట్ సీట్లను సాధించేందుకు ప్రధానపార్టీలు ప్రయత్నాలను మొదలుపెట్టాయి. జాతీయస్థాయిలో ఈ పార్లమెంట్ ఎన్నికలు కీలకంగా మారడంతో మూడు పార్టీలకు చెందిన పలువురు నేతలు, ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలను మొదలుపెట్టారు.గత ఎన్నికలకు భిన్నంగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండగా మూడు పార్టీలు జహీరాబాద్ నియోజకవర్గంలో గట్టిపోటీ ఇవ్వనున్నాయి. మరోమూడు నెలలోపు పార్లమెంట్ ఎన్నికలు ఉండనుండడంతో శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు అనుగుణంగా మూడుపార్టీల నేతలు అంచనాలకు వస్తున్నారు. ఎవరికి వారే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఎలాగైనా ఈసారి జెండా ఎగురవేయాలని కాంగ్రెస్,బీజేపీలు ప్రయత్నిస్తుండగా హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది.

• హైదరాబాద్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవనంలో రెండురోజుల క్రితం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కేటీఆర్ నిర్వహించి గెలుపుకై తీసుకోవాల్సిన చర్యలను, విధివిధానాలను వివరించారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యనేతలతో కేటీఆర్ సమావేశమై వారితో మాట్లాడుతారు. తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు గెలుపొందిన బీబీ పాటిల్‌నే ఈసారి బరిలో దింపుతారా కొత్త అభ్యర్థిని తెరపైకి తీసుకువస్తారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ ఆ పార్టీ క్యాడర్ తీవ్ర నిరాశకు గురైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. ఈసారి బీజేపీ పార్లమెంట్ ఎన్నికలపై సీరియస్‌గా ఫోకస్ చేయడంతో చీలేఓట్లతో తమకు లాభిస్తుందనే అభిప్రాయంతో బీఆర్ఎస్ శ్రేణులున్నారు. సమావేశానికి జిల్లాలోని 4అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందినముఖ్యనేతలు హాజరుకానున్నారు.

• పూర్వ వైభవానికి కాంగ్రెస్

జహీరాబాద్ పార్లమెంట్ కంచుకోటగా ఉన్న కాంగ్రెస్ పార్టీ గత 10 పదేళ్లుగా పట్టు కోల్పోయింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి పూర్వవైభావన్ని పొందేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లను సాధించి అధికారాన్ని చేజిక్కించుకుంది. అయితే జహీరాబాద్ పార్ల మెంట్ నియోజకవర్గంలోని ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాలు గు సీట్లను దక్కించుకుని మెజార్టీలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ఈ లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జిను సైతం నియమించింది. బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి జహీరాబాద్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ సీట్లను సాధించి అధికారంలోకి రావాలని ఆలోచనలో ఉంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఫలితాల ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీంలోనే రెండింటిని ఇప్పటికే అమలుచేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే స మయానికి మిగితా హామీలన్నీ నెరవేర్చి ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌తోపాటు మరికొం దరు సీనియర్ నేతలు పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

• కలిసొస్తుందనుకుంటున్న బీజేపీ

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీకి గతంతో పోలిస్తే ఈసారి ఓటు బ్యాంక్ చాలానే పెరిగింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలోనూ ప్రత్యేక దృష్టిసారించి మెజార్టీ సీట్లను సాధించాలనే ఆలోచనలో ఉంది. ఇందులో భాగంగానే జహీరాబాద్ పార్లమెంట్‌పై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి ఎమ్మెల్యే స్థానాన్ని మాత్రమే గెలుచుకోగలిగింది. మిగితా అసెంబ్లీ సీట్లను ఓడిపోవాల్సి వచ్చింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోంది. ఇప్పటినుంచే బీజేపీ కార్యచరణను ప్రారంభించింది. ఇప్పటికే ఓ దఫాలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీజేపీ కీలక సమావేశాన్ని నిర్వహించింది. బీజేపీ జాతీయ కార్యదర్శి తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల సమావేశం నిర్వహించారు. బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైన సత్తాచాటేందుకు కార్యచరణను ప్రారంభించారు. జహీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పోలిస్తే బీజేపీలోనే టికెట్‌కై ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఈస్థానం నుంచి పోటీ చేసేందుకు వడ్డెపల్లి సుభాష్ రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, సోమయ్యప్ప, పైళ్ల క్రిష్టారెడ్డి, మురళీధర్‌గౌడ్‌లతో పాటు మరో ముగ్గురు నేతలు పార్లమెంట్ టికెట్ కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

సర్పంచులకు.. బిల్లుల బెంగ!

• గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నెలలు గడుస్తున్నా నేటికీ రాని బిల్లులు • ఈ నెలాఖరుతో ముగియనున్న పదవీ కాలం
• బిల్లులు వచ్చేలోపు ఎన్నికల కోడ్ వస్తుందోమోనని భయం.. భయం • ఆందోళనలో పలు గ్రామాల సర్పంచ్‌లు



భిక్కనూరు, జనవరి 8: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు రాలేదని సర్పంచులు ఆందోళన పడుతున్నారు. సర్పంచుల పదవీకాలం దగ్గరపడుతున్న కొద్ది వారిలో ఈ ఆవేదన పెరిగిపోతోంది. జిల్లా వ్యాప్తంగా చాలా మంది సర్పంచ్‌లు వారి గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు లక్షల్లో డబ్బులు వెచ్చించారు. ఇందులో కొందరు సొంత డబ్బులు వెచ్చించగా మరికొందరు అప్పు చేసి మరి గ్రామాల్లో ఖర్చు చేశారు. పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అప్పు చేసిన సర్పంచ్‌ల పరిస్థితి అయితే వర్ణనాతీతం. ఈనెల చివరికల్లా సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండటంతో పాటుగా మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తులు చేస్తుండటంతో సర్పంచ్‌ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

• జిల్లావ్యాప్తంగా కోట్లలో బకాయిలు

జిల్లావ్యాప్తంగా మూడు రెవిన్యూ డివిజన్లతోపాటుగా 22 మండలాలు, 450 గ్రామాలున్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతారు. గతేడాది నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల్లో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఈఎంఐ, ట్రాక్టర్‌లో డిజిల్, కరెంట్ బిల్లులు, మురికికాలువల శుభ్రత, వీధిలైట్లు, వాటర్ పైప్‌ల లీకేజీలు, రోడ్ల శుభ్రత తప్పక చేయాల్సినవి కావడంతో సర్పంచ్‌లు తప్పని పరిస్థితుల్లో కొందరు సొంత డబ్బులతో చేపట్టగా.. మరికొందరు అప్పు చేసి ఖర్చు చేశారు. ఇందుకు జిల్లావ్యాప్తంగా సర్పంచ్‌లకు కోట్లలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులలో జాప్యం జరుగుతుండటంతో సర్పంచ్‌లు, ముఖ్యంగా చిన్నచిన్న గ్రామ పంచాయతీల సర్పంచ్‌లే ఆర్థికంగా చాలా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.

• ఈ నెలాఖరుతో ముగియనున్న పదవీకాలం

సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా కొంత, ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు సర్పంచ్‌లకు బిల్లులు రాలేదు. సర్పంచ్‌లు వారి పదవీకాలం ముగిసేలోపు ఈ బిల్లులు రాకపోతే పార్లమెంట్ ఎన్నికలతో మళ్లీ ఎన్నికల కోడ్ రానుంది. అదే జరిగితే సర్పంచ్‌లకు చేసిన పనులకు బిల్లులు రావాలంటే మరికొంత కాలం ఆలస్యం కానుంది. దీంతో తమ పదవీకాలం ముగియడంతో పాటుగా ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో తమ బకాయిల పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాకు రూ.2.30 లక్షలు రావాలి..

• చిట్టెడి మధుమోహన్‌రెడ్డి, అంతంపల్లి సర్పంచ్



మా గ్రామంలో చాలా అభివృద్ధి పనులు చేపట్టాం. గత ఏడాది మార్చి నుంచి దాదాపుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రాలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో నా సొంత డబ్బులు కొన్ని, మరిన్ని అప్పు చేసి పనులు చేపట్టాం. నాకు రూ.2.30 లక్షలు రావాల్సి ఉంది. ఈనెలతో మా పదవీ కాలం ముగిస్తుంది. మా డబ్బులు ఇవ్వాలి.

వడ్డీ కట్టలేకపోతున్నా..

• జనగామ శ్రీనివాస్, సర్పంచ్, సిద్ధరామేశ్వరనగర్



మా గ్రామాభివృద్ధికి కొంతకాలంగా నిధులు రాలేదు. అక్కడిక్కడ అప్పుచేసి గ్రామంలో మురికికాలువల శుభ్రత, ట్రాక్టర్‌కు డిజిల్, వీధిదీపాలు, వాటర్‌కోసం ఇలా చాలా పనులు చేపట్టాం. చేసిన వాటికి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం. అప్పుకు వడ్డీ కట్టడమే కష్టంగా ఉంది. త్వరగా మా బిల్లులివ్వాలి.



డిగ్రీ కళాశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రెండో రోజూ..
రసవత్తరంగా కబడ్డీ పోటీలు

కామారెడ్డి టౌన్, జనవరి 8: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 67వ అండర్ -17 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు రెండోరోజు సోమవారం రసవత్తరంగా కొనసాగాయి. ఉదయం కేరళ వర్సెస్ ఉత్తర ప్రదేశ్ మధ్య పోటీ జరుగగా ఉత్తరప్రదేశ్ జట్టువిజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్ వర్సెస్ కర్ణాటక మధ్య పోటీ జరుగగా కర్ణాటక విజయం సాధించింది. తెలంగాణ వర్సెస్ ఉత్తరఖండ్ మధ్య పోటీ జరగగా మ్యాచ్ టై అయింది. ఎన్‌వీఎస్ వర్సెస్ ఢిల్లీ మధ్య పోటీ జరగగా ఢిల్లీ విజయం సాధించింది. హర్యానా వర్సెస్ వరంగల్ పోటిపడగా జరగగా హర్యానా విజయం సాధించింది. రాజస్థాన్ వర్సెస్ ఛత్తీస్‌ఘడ్ పోటీ పడగా రాజస్థాన్ విజయం సాధించింది. బీహర్ వర్సెస్ పంజాబ్ మధ్య పోటీ జరుగగా బీహర్ విజయం సాధించింది. కేవీఎస్ వర్సెస్ ఒరిస్సా పోటీ పడగా కేవీఎస్ విజయం సాధించింది. అనంతరం సాయంత్రం నిర్వహించిన పోటీలలో జార్ఖండ్ వర్సెస్ మహారాష్ట్ర మధ్య పోటీ జరుగగా మహారాష్ట్ర విజయం సాధించింది. జమ్ముకాశ్మీర్ వర్సెస్ సీబీఎస్‌బీఎస్‌ఓ మధ్య పోటీ జరుగగా జమ్ము కాశ్మీర్ విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ వర్సెస్ విద్యాభారతీ మధ్య పోటీ జరుగగా విద్యా భారతీ విజయం సాధించింది. తమిళనాడు వర్సెస్ పుదిచ్చేరి మధ్య పోటి జరగగా తమిళనాడు విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ వర్సెస్ గుజరాత్ మధ్య పోటీ జరుగగా గుజరాత్ విజయం సాధించింది. ఛత్తిస్‌ఘడ్ వర్సెస్ మధ్యప్రదేశ్ విజయం సాధించగా ఛత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. పంజాబ్ వర్సెస్ సీఐఎస్‌సీఈ మధ్య పోటీ జరుగగా పంజాబ్ విజయం సాధించింది. కేవీఎస్ వర్సెస్ చండిఘర్ పోటీ పడగా కేవీఎస్ విజయం సాధించింది.

ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఏఈ

• వాహన బిల్లుల విషయంలో డ్రైవర్‌ను డబ్బులు డిమాండ్ చేసిన ఏఈ
• ప్రతీసారి డబ్బులు ఇవ్వలేక ఏసీబీని ఆశ్రయించిన డ్రైవర్ • వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ



• స్వాధీనం చేసుకున్న నగదు

కామారెడ్డిటౌన్, జనవరి 8: ట్రాన్స్‌కోలో వివిధ పరికరాలను తరలించేందుకు పెట్టిన వాహనాల బిల్లులు చెల్లించేందుకు డ్రైవర్‌కు డబ్బులు డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సయాని రాజు ఏసీబీ వలకు చిక్కాడు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ఆనందర్ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌కో (132 కే.వీలైన్స్) సబ్‌స్టేషన్‌లో సయాని రాజు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహిస్తున్నాడు. ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వివిధ పరికరాలను తరలించేందుకు మూడు గూడ్స్ వాహనాలను నడిపేందుకు డ్రైవర్ కుంట భైరవ ఒప్పందం చేసుకున్నాడు. అందుకు సంబంధించి భైరవకు నెలకు రూ.61 వేలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ఈ బిల్లులకు సంబంధించి ప్రతీనెల ప్రాసెస్ చేసేందుకు బిల్లుకు రూ.3000 చొప్పున ఏఈ రాజు డబ్బులు డిమాండ్ చేశాడు. మొత్తం మూడు నెలలకు సంబంధించి రూ.9000 లతోపాటు గతంలో మరో బిల్లుకు సంబంధించిన రూ.3500 ఇవ్వాలని ఏఈ రాజు డిమాండ్ చేయడంతో డ్రైవర్ భైరవ డబ్బులు ఇవ్వలేక ఏసీబీని ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఏఈ అడిగిన డబ్బులను ఇచ్చేందుకు సోమవారం డ్రైవర్ భైరవను సంప్రదించగా తన స్నేహితుడైన ఎవర్ గ్రీన్ జిరాక్స్ సెంటర్ సంతోష్ (అలియాస్ రాజు)కు ఇవ్వాలని చెప్పాడు. దీంతో భైరవ 12,500 నగదు ఇస్తుండగా జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు సంతోష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. సంతోష్ ఇచ్చిన ఆధారాల ప్రకారం ఏఈ రాజును అదుపులోకి తీసుకుని సుమారు 5గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం ఏఈ రాజుతో పాటు అతనికి సహకరించిన సంతోష్‌ను రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు



వీడియా కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సీఎంఆర్ డెలివరీ
టార్గెట్‌ను పూర్తిచేయాలి

• రాష్ట్ర పౌరసరాఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, జనవరి 8: సీఎంఆర్ డెలివరీ టార్గెట్‌ను పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరాపరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. లక్ష్యాలు పూర్తిచేసే వరకు సంబంధిత మిల్లులను అధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్‌లు, పౌరసరాఫరాల శాఖ అధికారులతో మాట్లాడారు. వానాకాలం, యాసంగికి సంబంధించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేట్లు చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రోజు వారి లక్ష్యాలను కేటాయించి మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం టార్గెట్ పూర్తి చేయుటకు జిల్లా కలెక్టర్‌లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లిఖార్జున్‌బాబు, డీఎం సివిల్ సప్లయ్ మేనేజర్ అభిషేక్‌సింగ్, డీఎల్‌పీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లతో ఏర్పాటు చేసిన

ఫ్లెక్సీలపై విచారణ జరపాలి

● బీఎల్‌టీయూ డిమాండ్



నెహ్రూపార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సుభాష్‌నగర్, జనవరి 8 : మున్సిపల్ ఉద్యోగుల సంఘం పేరుతో రాజకీయ పార్టీలను తలదన్నేలా లక్షల రూపాయలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్రమవసూళ్లు చేస్తున్న వారిపై విచారణ జరపాలని బీఎల్‌టీయూ నాయకులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటనలో మున్సిపల్ కార్పొరేషన్‌లో భవనాల టాక్స్ వసూలు చేసే ఓ ఉద్యోగి ఉద్యోగుల సంఘం పేరుతో కొంత మంది నగరంలో దాదాపు 150 ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఫ్లెక్సీలు నగరంలోని వివిధ వ్యాపార సంస్థల నుంచి పెద్ద ఎత్తున డబ్బు లు వసూలు చేసి పెట్టడం జరిగిందన్నారు. ఇటువంటి ఫ్లెక్సీలను నగరంలోని ప్రధాన చౌరస్తాతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ ఫ్లెక్సీపై టిఫిన్ సెంటర్లు, హోటల్స్, షాపింగ్ మాల్స్ బిల్డర్స్ ఏర్పాటు చేసినట్లుగా ఉందన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల ఫ్లెక్సీలు ఇంత పెద్ద ఎత్తు న పెట్టలేదని, అర్బన్ ఎమ్మెల్యేగా గెలిచిన సూర్యనారాయణ గుప్త ఫ్లెక్సీ కూడా ఇలా ఏర్పాటు చేయలేదన్నారు. అక్రమంగా ఏర్పాటైన ఫ్లెక్సీలపై విచారణ జరిపి వివిధ వ్యాపార సంస్థల నుంచి వసూలు చేసిన సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మాల మహానాడు

నిజామాబాద్ రూరల్ అధ్యక్షుడిగా జె.గంగారాం

జక్రాన్‌పల్లి, జనవరి 8 : మాలమహానాడు నిజామాబాద్‌రూరల్ అధ్యక్షుడిగా జక్రాన్‌పల్లి మండలానికి చెందిన జె.గంగారాంను నియామించారు. ఈ మేరకు సోమవారం జె.గంగారాంకు నియామకపత్రాన్ని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టి.సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా జె.గంగారాం మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ నేతృత్వంలో పని చేస్తానన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.37లక్షల చెక్కుల పంపిణీ



మోర్తాడ్‌లో బీమా చెక్కులను పంపిణీ చేస్తున్న యుబీఐ అధికారి

మోర్తాడ్, జనవరి 8 : మండల కేంద్రంలోని యుబీఐ బ్యాంకులో సోమవారం జిల్లా రిజినల్ అధికారి శంకర్ ఏబ్రం సుమారు రూ.30 లక్షల బీమా చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. బ్యాంకు ఖాతాదారులైన ముప్పారం రాజేశ్వర్ ప్రమాదవశాత్తు మరణిస్తే ఆయన రూ.30లక్షల బీమా మంజూరైందని, అంతేగాక పోస్టుమెన్ రమేష్‌కు కూడా ప్రమాదవశాత్తు చనిపోవడంతో రూ.7లక్షల 75వేల ప్రమాద బీమా మంజూరైందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుబీఐ మార్కెటింగ్ అధికారి పృధ్వీ, స్థానిక మేనేజర్ సతీష్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది, సతీష్, రమ్య, జలజ, స్థానిక ఉపసర్పంచ్ సొక్కాయి గంగా రెడ్డి, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబాకు 108 రకాల నైవేద్యాలు



108 రకాల మిఠాయిలతో సాయిబాబాకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

ముప్కాల్, జనవరి 8 : ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద గల సాయిబాబా మందిరంలో సాయి సహస్ర పారాయణంలో భాగంగా సోమవారం 108 రకాల స్వీట్‌లతో సాయిబాబాకు నైవేద్యాలు, దీపోత్సవం నిర్వహించారు. శ్రీ అవదూతానంద సరస్వతిస్వామి దివ్యశీస్సులతో ప్రారంభమైన పారాయణంలో 108మందికిపైగా భక్తులు పాల్గొని గురుపారాయణం నిర్వహించారు. ప్రతీరోజు ముప్కాల్ భజన మండలి వారి ఆధ్వర్యంలో సాయిభజన సంకీర్తలు వైభవంగా జరుగుతాయి. ఇందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. చపన్‌బోగ్ వారి సహకారంతో 108రకాల వంటకాలతో సాయిబాబాకు నైవేద్యాలు సమర్పించినట్టు సాయిసేవ సమితి సభ్యులు తెలిపారు. అంతకు ముందు ఆదివారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరు కలిసి స్వస్తిక్ ఓంచక్రం అకారాలతో కూడిన దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో సాయిసేవ సమితి సభ్యులు, పారాయణం భక్తులు, వీడీసీసభ్యులు, గ్రామస్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రెంజల్,జనవరి8: మండలంలోని నీలా గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయం నందు డంప్ చేయడం జరిగిందని ఇట్టి ఇసుకను గురువారం వేలం వేయడం జరుగుతుందని తహసీల్దార్ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వఆరు రెంజల్ తహసీల్దార్ కార్యాలయానికి మధ్యాహ్నం 12గంటలకు వచ్చి వేలంలో పాల్గొనాలని అన్నారు.

'జీవో నెం.2ను ఉపసంహరించుకోవాలి'

బోధన్ రూరల్, జనవరి 8 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మెపై అత్యవసర సర్వీసుల చట్టం ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవో నెం.2ను ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పుట్ట వరదయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిసెంబర్ 12 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ టీచర్లు సమ్మె చేపట్టారు. ఎన్నిసార్లు నిరసన తెలిపినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల లో తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మెకు దిగారన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సామాజిక భద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. నియంతృత్వ పద్ధతిలో సమ్మెను అణచివేయాలని జగన్ ప్రభుత్వం చూస్తుందని ఇది దుర్మార్గపు పాలన అని ఆయన ఆరోపించారు. ఎస్మాను ఉపసంహరించుకుని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కోళ్ల పందెం నిర్వాహకులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పొతంగల్‌లో కోళ్ల పందెం స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కోటగిరి,జనవరి8: పొతంగల్ శివారులో కోళ్ల పందెలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పొతంగల్ మంజీర నది శివారులో సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్ బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కోళ్ల పందెల నిర్వహణకు నిర్వాహకులు సమాయత్తం అయ్యారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల రాకను గమనించిన నిర్వాహకులు అక్కడి నుంచి పరారీ అయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 29,170రూపాయల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పందెం కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట కోటగిరి ఎస్ఐ సందీప్‌న్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నవీపేట,జనవరి8: మండలంలోని బినోలకు చెందిన పందిరి స్వప్న, భట్టు లక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 7న ఇంటి సమీపంలో ఉన్న వీరు పరస్పరం ఒకరిపై ఒకరు దూషించుకుంటూ దాడులు చేసుకున్నారని ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ ఫలాలు బలహీనవర్గాలకు అందేలా కృషి చేయాలి

● కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్


మాట్లాడుతున్న కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్తకార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బీజేపీ నాయకులు


కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, జనవరి8: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు బలహీన వర్గాలకు చేరేలా అధికారులు కృషి చేయాలని కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ సంయుక్తకార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అశ్విని శ్రీవాస్తవ్ మాట్లాడుతూ అర్హులైన వారు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకున్నప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరి ఆయా పథకాలకు సార్థకత చేకూరుతుందన్నారు. వివిధ వర్గాల వారి కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి లబ్ధిచేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తుందన్నారు. పేదప్రజలకు మౌలిక సదుపాయాలైన ఎల్‌పీజీ కనెక్షన్‌లు, పక్క ఇళ్లు, ఆహార భద్రత, పౌష్ఠికాహారం, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య, స్వచ్ఛమైన తాగునీరుతో పాటు ఆర్థిక సహాయం లాంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అర్హులైన లబ్ధిదారులు వీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్‌లు ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎల్‌పీవో శ్రీనివాస్, సర్పంచ్ దార్ల దివేన, ఎంపీటీసీ లినిత, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

అంకాపూర్‌లో..

మండలంలోని అంకాపూర్ గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిశోర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎంసీ.గంగారెడ్డి, మహేందర్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం, మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మీ, ఏపీవో సురేష్, తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉజ్వల పథకం, సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి యోజన, ఫసల్‌బీమా యోజనలతో పాటు వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పసుపుబోర్డు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి పథకాల క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.,నర్సింహరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, అసెంబ్లీ కన్వీనర్‌పాలెపు రాజు, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పులి యుగంధర్, పీర్‌సింగ్, మహిళ మోర్చనాయకురాలు స్వభావికగౌడ్, పద్మ, సునీత, నిఖిత, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, బ్యాంకు అధికారులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, దేవునిగుట్ట తండా గ్రామాలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ సేవలు పొందాని, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, సర్పంచ్‌లు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.











కొనసాగుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ పనులు


కొనసాగుతున్న ప్రజాపాలన డాటా ఎంట్రీ పనులు

భీమ్‌గల్‌రూరల్, జనవరి8: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 6తో ముగిసింది. మొత్తం మండలంలో 15550 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవోరాజేశ్వర్ తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఆయాగ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తు ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఎంట్రీ పనులు పూర్తవుతాయని అన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ షురూ

● రూరల్ సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు

● రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్న సిబ్బంది ● రూరల్‌లో 8684 దరఖాస్తులు

నిజామాబాద్ రూరల్, జనవరి 8: సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ప్రక్రియ వేగవంతం చేశారు. రూరల్ మండలంలో మొత్తం 8684 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీవో మధురిమ తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో లబ్ధిదారులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటికి సంబంధించి ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించింది. దాంతో రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కంప్యూటర్‌సెల్‌ను ఏర్పాటుచేశారు. మండలంలోని కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో ఆన్‌లైన్ నమోదుచేస్తున్నారు. ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో సిబ్బంది ఆన్‌లైన్‌చేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు తిరిగి రాత్రి 8గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మరో షిఫ్టును నిర్వహిస్తున్నారు.మొత్తం 8684 దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3010 దర ఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీవో మధురిమ తెలిపారు. సిబ్బంది ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఎంపీవో మధురిమ దగ్గరుంచి పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 12లోపు పూర్తి దరఖాస్తులను పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

ముప్కాల్‌లో శివాజీ విగ్రహానికి భూమిపూజ

ముప్కాల్, జనవరి8: ముప్కాల్ మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ బద్దం నర్సవ్వ కలిసి భూమిపూజ చేశారు. 44వ జాతీయ రహదారి నుంచి గ్రామానికి ప్రవేశించే రహదారి మధ్యలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేశారు. ఈ విగ్రహాన్ని ఛత్రపతి శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శివాజి మహరాజ్ మరాఠ సామ్రాజ్యం నెలకొల్పి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించిన వీరుడని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మ, మండల బీఆర్ఎస్ సీనియర్ పార్టీ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, నాయకుడు కిషన్, వీడీసీసభ్యులు, శివాజీ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు గన్‌మెన్‌ల తొలగింపు

ఖిల్లా, జనవరి 8: పోలీస్‌శాఖ ద్వారా ప్రజాప్రతినిధులకు నియమించే గన్‌మెన్‌లను తొలగించినట్లు తెలిసింది. గతంలో ప్రాణభయం ఉన్న ప్రజాప్రతినిధులు దరఖాస్తు చేసుకుంటే వారిపై నిఘా వర్గాల వారు (ఇంటెలిజెన్స్) పూర్తి వివరాలు సేకరించి వారికి గన్‌మెన్‌లను నియమించేవారు. ప్రాణభయం (థ్రెటనింగ్) లేని ప్రజాప్రతినిధులకు గన్‌మెన్‌లను తొలగించారు. వీరిలో నగర మేయర్ దండునీతూకిరణ్, తారిక్ అన్సారి, మార గంగారెడ్డి, మధుశేఖర్‌లు ఉన్నారు.

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

నందిపేట, జనవరి 8:మండలంలోని కంఠం గ్రామానికి చెందిన జంగం సిద్ధయ్యకు ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. గ్రామానికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పర్యటించిన సందర్భంలో వికలాంగుడైన తనకు ట్రై సైకిల్ ఇవ్వాలని కోరాడు. ఆయన కోరిక మేరకు స్పందించిన ఎమ్మెల్యే ఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జంగం సిద్ధయ్యకు సైకిల్‌ను అందజేశారు. సైకిల్‌ను అందజేసిన వారిలో చిన్న, సాయి, రవి, తదితరులు ఉన్నారు.

నాళేశ్వర్, బినోలలో గ్రామసభలు

నవీపేట,జనవరి8: మండలంలోని నాళేశ్వర్, బినోలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంట పొలాలకు డ్రోన్ సహాయంతో రసాయనిక ఎరువులు చల్లే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఆర్ఐ మోహన్, ఏవో సురేష్ గౌడ్, ఏపీఎం భూమేష్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, నాళేశ్వర్ సర్పంచ్ సరిన్, ఉపసర్పంచ్ పోశెట్టి తదితరులున్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

మోస్రా,జనవరి8: మండల కేంద్రంతో పాటు చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్ గ్రామాలలో సోమవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. 22వ తేదీన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి అయోధ్య రామాలయం దివ్య కాంతులను చూసి ఆనందించాలని కార్యకర్తలు భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏర్గట్ల, జనవరి 8: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంఈవో ఆంధ్రయ్య కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కోటగిరి,జనవరి8: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సంపంగి మౌనిక(25)అనే వివాహిత అనుమానాస్పద స్థితి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. భార్యభర్తల మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు నెలకొని ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున భర్త మహేష్ పౌల్ట్రీ ఫారంలో పని చేసేందుకు వెళ్లాడు. అనంతరం మౌనిక ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టింది. మృతురాలి తనయుడు తండ్రికి సమాచారం అందించగా వచ్చి చూసేసరికి మౌనిక మృతి చెందింది. మృతురాలి బంధువులు భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ఆరోపించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలోమృతి చెందినట్లు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన యువకుడి మృత్యువాత

● అనుమానాస్పదంగా యువకుడి మృతి

● పదిరోజులకు మృతదేహం లభ్యం ● కేసు నమోదు చేసిన పోలీసులు


నరేష్ (ఫైల్)

ఇందల్వాయి, జనవరి 8: గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన యువకుడు మృత్యువాత పడ్డాడు. అనుమానాస్పద స్థితిలో బండరాళ్ల మధ్య యువకుడి మృతదేహం పడి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగల్‌పాడ్ తండాకు చెందిన లావుడ్య నరేష్ అనే (21) డిసెంబర్ 30వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడని చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికిన కుటుంబ సభ్యులు జనవరి 1వ తేదీన ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నరేష్ తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 302, 201 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అప్పటి నుండి యువకుడి జాడ కోసం వెతుకుతున్నామని సోమవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వెనకాల రైలుపట్టాల వద్ద ముళ్ల పొదల్లో బండరాళ్ల మధ్య మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించి నరేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నరేష్ వదిన జ్యోతి, మరికొంత మంది తండావాసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహం పైఉన్న దుస్తుల ఆధారంగా నరేష్ మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు.మృతుడికి గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. మృతుని భార్య అనురాధా నెల రోజుల క్రితం రెండో కుమార్తెకు జన్మనివ్వడంతో పుట్టింటి వద్దే ఉందని అన్నారు. మృతుడు మద్యానికి బానిసై అప్పులు చేశాడని చెప్పారు. మృతుని తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ కృష్ణ తెలిపారు.

వీర జవాన్ల కుటుంబాలకు చెక్కుల అందజేత

నిజామాబాద్ అర్బన్, జనవరి 8: ఆర్మెడ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా నుంచి ఆర్మీలో విధులు నిర్వహిస్తు సర్వీసులో మరణించిన ముగ్గురు సైనికుల యొక్క కుటుంబాలకు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చెక్కులను అందజేశారు. ఇందల్వాయి మండలం చంద్రయాన్‌పల్లికి చెందిన చెవుల ప్రశాంత్ భార్య సుకన్యకు, బోధన్ మండలం కూమన్‌పల్లికి చెందిన నీరడి గంగాప్రసాద్ భార్య నీరడి శిరీషకు, కామారెడ్డికి చెందిన ఈగజైపాల్ భార్య ఈగస్వరూపకు ఒక్కొక్కరికి 3లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఆర్మెడ్ ఫోర్సెస్ ఫండ్‌కు సిరికొండకు చెందిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అందించిన 50వేల చెక్కును పాఠశాల ప్రిన్సిపల్ నర్సయ్య కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వాములు

కన్నుల పండువగా..
అయ్యప్ప పడిపూజ మహోత్సవం

బీర్కూర్, జనవరి8: మండల కేంద్రంలోని తోట్ల హనుమాన్ ఆలయ సన్నిధిలో సోమవారం అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. 18మెట్లు ఏర్పాటుచేసి అయ్యప్ప స్వామి వారి కి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. మాలవిరమణ కోసం శబరిమలైకి వెళ్లే భక్తులకు గురుస్వాములు ఇరుముడులు కట్టారు. మాలాధారుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గ్రామపొలిమేర వరకు తరలివెళ్లి స్వాములను సాగనంపారు.

తాడ్వాయిలో ఎన్ఎస్ఎస్ శిబిరం



శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడ్వాయి, జనవరి8: గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చిట్యాల గ్రామంలో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 7రోజులపాటు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతువేదిక ఆవరణలో ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రపరచడానికి కార్యచరణ ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితాబాలయ్య, ఎంపీటీసీ రాజమణిరవీందర్, కళాశాల అధ్యాపకులు వీరేశం, సంతోష్, శ్రీనివాస్,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, జనవరి8: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని 47వ వార్డులో శ్రీరామ జన్మభూమి దివ్యక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన అయోధ్య బాలరాముని పాదస్పర్శిత అక్షింతలను వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణలు ఇంటింటికి పంపిణీచేశారు. రామమందిర్ ఆలయంలో అక్షింతలకు పూజలుచేసి అక్కడి నుంచి ఊరేగింపుగా అక్షింతలను తీసుకుని వచ్చారు. భారత్‌రోడ్డు, స్టేషన్‌రోడ్డు, కమ్మరిగల్లి, గడిరోడు, అర్కల, బట్టు, కాకర్ల, కుంబాల గల్లీల్లో అక్షింతలు పంపిణీ చేశారు.

● సదాశివనగర్‌లో..

సదాశివనగర్: సదాశివనగర్ మండలకేంద్రంలో సోమవారం అయోధ్య రాముని అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీరామతీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ అయోధ్యలో బాలరామునికి పూజించిన అక్షింతలను ప్రతి ఇంటికి అందిస్తామని తెలిపారు.

● ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని రామాలయం గుడి వద్ద సోమవారం అయోధ్య తీర్థ క్షేత్రట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కళ్యాణి,అడవిలింగాల, రత్నాపూర్ వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్థులకు అయోధ్య రామమందిరం అక్షింతలతో పాటు కరపత్రాలను అందించారు. అనంతరం ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో భారీ ఎత్తున అక్షింతల ఊరేగింపు గ్రామస్థులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘువీర్ గౌడ్, అరవింద్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు పరామర్శ

భిక్కనూరు, జనవరి8: భిక్కనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పట్లోళ్ల హన్మంత్‌రెడ్డికి ఇటీవల కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స జరగగా సోమవారం ఆయనను కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డిని గంపగోవర్ధన్ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట నర్సింగ్‌రావు ఉన్నారు

మతపరమైన బోధనలు చేస్తున్న
పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



విచారణ చేపడుతున్న ఎంఈవో నాగేశ్వరరావు

బాన్సువాడటౌన్, జనవరి8: పట్టణంలోని స్పార్క్ మైండ్ పాఠశాలలో విద్యార్థులకు ఓ వర్గానికి చెందిన ఉపాధ్యాయుడు మతపరమైన బోధనలు చేస్తున్నాడని, తక్షణమే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంఈవో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అన్నిమతాలు సమానమని బోధించాల్సిన ఉపాధ్యాయులు కేవలం మతపరమైన బోధనలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాంటి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవడంతోపాటు, పాఠశాల గుర్తింపును సైతం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునేంత వరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పడంతో ఎంఈవో నాగేశ్వరరావు విద్యార్థి సంఘాల నాయకులను కలిసి పాఠశాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కోనాల గంగారెడ్డి, సాయికిరణ్, అశ్విన్, రవీందర్, పుట్ట భాస్కర్, జైత్రాం రాథోడ్, నాయకులు ఉన్నారు.

● విచారణ చేపట్టిన ఎంఈవో

స్పార్క్ మైండ్ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మతపరమైన బోధనలు చేస్తున్నారనే విషయం సోషల్‌మీడియా ద్వారా రావడం.. విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టడంపై ఎంఈవో నాగేశ్వరరావును స్పందించారు. సిబ్బందితో కలిసి సోమవారం స్పార్క్‌మైండ్ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. విద్యార్థులకు మతపరమైన బోధనలు చేసిన ఉపాధ్యాయుడి తక్షణమే టర్మినేట్ చేయాలని యాజమాన్యానికి ఆదేశాలిచ్చారు. అదేవిధంగా పాఠశాలలో ఏం జరుతోంది.. విద్యార్థులకు ఎలాంటి విద్యను బోధిస్తున్నారనే అంశంపై సమగ్ర విచారణ జరిపి తుదినివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈవో

నాణ్యమైన భోజనం అందించాలి

ఎల్లారెడ్డి, జనవరి 8: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో వెంకటేశం ఆదేశించారు. మండలంలోని కళ్యాణిగ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఆగిపోవడంతో సోమవారం ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం తిరిగి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, రవీందర్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు కాశీనాథ్, గంగామణి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్, జనవరి 8: బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. జహీరాబాద్ పార్లమెంట్‌లోని 7నియోజకవర్గ పరిధిలోగల కామారెడ్డిలో మాత్రమే బీజేపీ ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి గెలవడంతో ఆయనకే బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

రిలయన్స్ ఆధ్వర్యంలో చెక్ డ్యాం నిర్మాణం

పెద్ద కొడప్‌గల్, జనవరి 8: మండలంలోని కాటేపల్లి గ్రామంలో సోమవారం రిలయన్స్ ఆధ్వర్యంలో చెక్ డ్యాం నిర్మాణానికి సర్పంచ్ బోదనం విఠల్, రిలయన్స్ మేనేజర్ రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ మేనేజర్ రాజు మాట్లాడతూ... గ్రామ శివారులో చెక్ డ్యాం నిర్మించడం వలన భూగర్భ జలాలు పెరగడంతో పాటు వన్య ప్రాణులు, గ్రామంలో పశువులకు దాహార్తి తీర్చుకుంటాయని తెలిపారు. అంతేగాక ఈ చెక్ డ్యాం నిర్మాణం వలన 40 మంది రైతులకు సంబంధించిన 100 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో పాటుగానే తమ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో స్వచ్ఛంద సేవలు అందిస్తామని తెలిపారు. అంతే కాకుండా ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వాడకం, కూరగాయల పెంపకం, పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో మహిళలు ఆర్థిక సావలంభన సాధించే కార్యక్రమంలో భాగంగా కుట్లు, అల్లికలు లాంటి రంగాలలో శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీరేశం, ఆర్ఎఫ్ ప్రతినిధి ముకుంద్, పాలకేంద్రం ప్రతినిధి చాంద్, రైతులు మల్లప్ప పటేల్, మొగులా గౌడ్, బుగుడాల హన్మండ్లు, చౌటకూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్ డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

శబరిమలైకు అయ్యప్ప దీక్షా స్వాములు

బాన్సువాడటౌన్, జనవరి 8: మండలకాలం పాటు దీక్షను పూర్తి చేసి అయ్యప్ప దీక్షా స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. సోమవారం స్థానిక అయ్యప్ప ఆలయంలో గురుస్వాములు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 55 మంది దీక్షా స్వాములు శబరియాత్రకు వెళ్లారు. వీరికి మహిళలు, గురుస్వాములు ఘనంగా సాగనంపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, ర్యాల విఠల్‌రెడ్డి, నర్సన్నచారీ, నారాయణరెడ్డి, పాండురంగశర్మ, కొత్తకొండ భాస్కర్ తదితరులు ఉన్నారు.

వికసిత భారత్ క్యాలెండర్ ఆవిష్కరణ

బీర్కూర్, జనవరి 8: మండల కేంద్రంలో సోమవారం వికసిత భారత్ కార్యక్రమానికి సంబంధించిన క్యాలెండర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని పౌరులందరికీ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అధికారులు తెలిపారు.

● వికసిత భారత్‌పై అవగాహన

వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలో అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఏ పథకం అమలు చేశారు. ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

బీర్కూర్, జనవరి 8: మండలంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లత అన్నారు. కామారెడ్డి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న లతను ప్రభుత్వం బదిలీపై బీర్కూర్ తహసీల్దార్‌గా నియమించింది. మొన్నటి వరకు బీర్కూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జనార్ధన్‌ను కామారెడ్డికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ లత మాట్లాడుతూ.. బీర్కూర్ మండలంలో బీర్కూర్, బరంగేడ్గి, కిష్టాపూర్, దామరంచ గ్రామాలలో మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు విశ్వశాంతి గీతాజ్ఞాన యజ్ఞం

సదాశివనగర్, జనవరి 8: మండలంలోని లింగంపల్లి శ్రీకృష్ణ మందిరం వద్ద విశ్వశాంతి గీతా జ్ఞానయజ్ఞాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ ఆలయ పీఠాధిపతి మాచాలే బాబా తెలిపారు. మూడురోజుల పాటు సుమారు 3000 మంది మహాను భావులతో యజ్ఞంలో పాల్గొంటారని తెలిపారు.

టీయూలో బయో ఇన్ఫర్మెటిక్స్‌పై సదస్సు

డిచ్‌పల్లి, జనవరి 8: తెలంగాణ యూనివర్సిటీలోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ బయో ఇన్ఫర్మెటిక్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. రోల్ ఆఫ్ బయోఇన్స్‌ఫైర్ మ్యాటిక్స్ ఇన్ అండర్ సెల్.. అనే అంశంపై వర్క్ షాపు బయో ఇన్ఫర్మెటిక్స్‌లో విశ్లేషించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రైమ్ మినిస్టర్ రిసార్చ్ ఫెలోషిప్ ముకులిక, శారదలు పీజీ విద్యార్థినులకు రిసార్చ్‌స్కాలర్‌కు ప్రాక్టికల్‌సెషన్స్ నిర్వహించారు.

రేపు సర్పంచ్‌ల ఫోరం రౌండ్ టేబుల్ సమావేశం

భిక్కనూరు, జనవరి 8: హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 10న బుధవారం సర్పంచ్‌ల ఫోరం రాష్ట్రస్థాయి రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు నర్సింలుయాదవ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సమస్యలపై చర్చించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు కొదండరాం, వేణుగోపాల్, సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమనయాదవ్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచ్‌లందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు, జనవరి 8: ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా మాజీమంత్రి షబ్బీర్‌అలీని మండలంలోని మల్లుపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీని వారు శాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా షబ్బీర్‌అలీ ఎన్నికపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, తిరుపతిగౌడ్, తురుపతిరెడ్డి, భిక్షపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో ఫిజియోథెరపి పరీక్షలు

మద్నూర్, జనవరి 8: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈ ఆర్పీ మాట్లాడుతూ.. సుమారు 200లకు పైగా ప్రత్యేక అవసరాలు గల వారున్నారన్నారు. ఇంటి వద్ద వ్యాయామాలు చేయించాలని ఫిజియోథెరపిస్టు విశాలాక్షి తెలిపారు. సోమవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించామన్నారు.

డిప్యూటీ సీఎంతో ప్రత్యేక కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి,జనవరి 8: హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రపంచానికి కొత్తరూపం ఇద్దామనే కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు. నిర్వహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతల వితరణ

బీబీపేట, జనవరి 8: మండలంలోని యాడారం గ్రామంలో అయోధ్య రామమందిర తీర్థ క్షేత్రట్రస్ట్ సభ్యులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి అయోధ్య రామమందిర అక్షింతలను అందించారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం దృష్ట్యా రామ మందిర అక్షింత వితరణ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బట్టు భరత్‌రాజు, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాంధారి: మండలంలో సోమవారం మేడిపల్లి గ్రామంలో శ్రీరాముని అక్షింతల పంపిణీ చేశారు. మండల కేంద్రం నుండి అక్షింతలను గ్రామంలోని యువకులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రజలకు పంపిణీచేశారు.



నర్సారెడ్డి మృతదేహం

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

తాడ్వాయి, జనవరి 8: మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన అల్లూరి నర్సారెడ్డి (39) అనే కౌలు రైతు ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. నర్సారెడ్డి రెండెకరాల్లో భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మొక్కజొన్న పంటకు నీరు పారించడానికి వెళ్లాడు. అయితే పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్‌కు ప్రమాదవశాత్తూ తగిలి.. కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎల్లారెడ్డి, జనవరి 8: మండలంలోని జంగమయిపల్లి గ్రామానికి చెందిన అక్కంబాలు(19) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం మత్తమాల గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అతని తమ్ముడిని ద్విచక్ర వాహనంపై పాఠశాలలో దింపి తిరిగి ఇంటికి వస్తుండగా రెండు గ్రామాల మధ్య ఉన్న మూలమలుపు వద్దఎల్లారెడ్డి నుంచి మత్తమాల వైపు వెళ్తున్న బోర్‌వేల్ లారీ ఢీకొనడంతో బాలు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఎల్లారెడ్డి మోడల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

బస్టాండ్ ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన

దోమకొండ, జనవరి 8: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రహరీ నిర్మాణం పనులను సోమవారం ఆర్టీసీ డీఎం ఇందిరా, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి చుట్టూ కొలతలను గ్రామ పెద్దలతో కలసి చర్చించారు. ఆర్టీసీ నిధులు రూ.29 లక్షలతో బస్టాండ్ మరమ్మతు పనులు, ప్రహరీ నిర్మించడం జరిగుతుందని డీఎం తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ ఐరేని నర్సయ్య, సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్,బొర్రెడ్డి కిషన్‌రెడ్డి, పున్న లక్ష్మణ్, అబ్రబోయిన రాజేందర్, నేతుల సుధాకర్, షమ్మీ, ఎండపల్లి చిలుకయ్య, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

భిక్కనూరు, జనవరి 8: మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ అనసూయ, మెదక్ జిల్లా కాట్రియాల్ సర్పంచ్ స్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ- గ్రామం నుంచి మెదక్ జిల్లా రామాయంపేట మం డలంలోని కాట్రియాల్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందని, ఇదవరకు ఉన్న బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని అన్నారు. ఈ బీటీ రోడ్డు నిర్మాణంలో రెండు జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలతో పాటుగా ఈ రోడ్డుగుండా ప్రయాణించే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కామారెడ్డి జిల్లా ఆస్పత్రిని సందర్శించిన విద్యార్థులు

భిక్కనూరు, జనవరి 8: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విద్యార్థులు సోమవారం కామారెడ్డి జిల్లా ఆసుపత్రిని ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది విద్యార్థులకు ఐసీటీసీ, పీపీటీసీ, ఏఆర్టీ, ఎస్‌టీడీ, రక్తనిధి సేవలు, ఎయిడ్స్ రోగుల సేవలు, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తదానం తదిరత విషయాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు సోషల్‌వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యావేక్షకులు డాక్టర్ విజయలక్ష్మీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా ఆసుపత్రి వద్ద సౌత్‌క్యాంపస్ విద్యార్థుల బృందం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35	- సలార్
దర్శన్	- ద బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్
శాంతి	- ఎనిమల్
ప్రియా 70	- హాయ్ నాన్న

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	200	240
వెన్‌కాబ్(కిలో)	:	145	205	245

